కథా నిలయం
శ్రీకాకుళం

డవాలు

కుడిచేత్తో ఆఫీసు ఫైల్సు భద్రంగా పట్టుకుని, ఎడం చేత్తో ముఖంమీంచి కారే చెమట తుడుచుకుంటూ పరిగెత్తుతున్నాడు బంట్రోతు కోటయ్య, ముందుపోయే ఆఫీసర్ సైకిల్ వెనకాలే. రోడ్డుమీద ఎదురుగా వొచ్చేజనం, తన ముఖంలోకి ఎగతాళిగా చూసి నవ్వటానికి పరిగెత్తుతూ మీదిమీది కొస్తున్నట్టనిపించిం దతనికి. నవజవాన్ కోటయ్య ఆరోజే కొత్తగా జమానుగిరిలో ప్రవేశించాడు. సైకిల్ వెంట పరిగెత్తటం అతనికి కొత్తగా, వింతగా, అవమానకరంగా ఉంది. 'జట్కా ఎంబడి లగెత్తే పిల్లోడిలాగా, ఏంటిది ?' అనుకున్నాడు. ఈ ఆలోచన రాగానే అతనికి తన చిన్నతనపు రోజులు జ్ఞాపకానికొచ్చాయి. ఏదైనా జట్కా తనముందుగా పోతూంటే ఆటకోడితనంగా దాని

వెంట పరిగెత్తేవాడు, అలుపువొచ్చేదాకా. అప్పుడు గనక అలుపురాగానే ఆగేవాడు. కాని ఇప్పుడో! ఆ రోజుల్లో తనని శాసించేవాడెవడూ లేడు. కాని ఆ రోజులు గిర్రున తిరిగి పోయాయి. ఇప్పుడు తను పోషించేవాడు. తన రెక్కలమీద తనేకాక ఇంకా ముగ్గురు ఆధారపడి ఉన్నారు—తల్లీ, తమ్ముడూ, భార్యా. కుర్చీలో కూచుని పనిచేసేటంత చదువు లేదు తనకి. అయినప్పుడు అలుపుని గురించి ఆలోచన అనవసరం. అయినా తను ఒళ్లు దాచుకునేరకం కాదు. కష్టపడగలడు. కాని ఈ జవానుపనికాక మరోటయితే బాగుండును. పోనీ ఈ పనే అయినా, ఈ సైకిల్ వెంట పరిగెత్తడం లేకపోతే...

పరాకుగా ఆలోచిస్తూ పరిగెత్తుతున్న కోటయ్యకి తపీమని ఎదురుదెబ్బ తగిలింది. వొంగి నెత్తురు కారుతున్న వేలిని పట్టుకుని తలెత్తి ముందుకు చూశాడు. ఆఫీసర్ సైకిల్ క్రమంగా దూరమవుతోంది. అలాగే బాధతో మళ్ళీ పరిగెత్తటం మొదలుపెట్టేడు కోటయ్య. సైకిల్ సమీపిస్తుండగా 'కోటాయ్', అనే కేక రౌద్రంగా వినబడ్డది. కోటయ్య మనస్సు చివుక్కుమంది. తను కోటి, కోటప్ప, కోటయ్య అనే పేర్లకే అలవాటుపడ్డాడు. ఎవరూ కూడా ఇంతకుముందు తనని కోటాయ్ అని పిలవటానికి సాహసించలేదు. హుఁ...కోటాయ్‌ట !

"ఏరా, చెవుడా ఏం ?"

కోటయ్య ముఖం జేవురించింది. వొస్తున్న కోపాన్ని అణచుకుని "ఏంటండీ?" అనబోయి, మళ్ళీ ఆగి "అయ్యా", అన్నాడు.

"కలం తీసుకురావటం మర్చిపోయాను. అమ్మగారి నడిగి తీసుకురా. పరిగెత్తు. ఇక్కడున్నట్టు రావాలి."

అసలే ఎదురుదెబ్బ తగిలి బాధపడుతుంటే మళ్లీ నడిచినంత దూరం వెనక్కి వెళ్ళి తిరిగి రావటం— మామూలుగా కాదు— పరిగెత్తుకు రావటం! సైకిల్ ఉన్నాయనకే వెళ్ళటానికి బద్ధకమయితే...పోనీ ఆ సైకిలిచ్చి వెళ్ళిరమ్మన కూడదూ! మనిషి ఉన్నాడు గదా అని...

"మాట్లాడవేం?"

"చిత్తం", అన్నాడు కోటయ్య. అంతకంటె ఏమన గలడు గనక!

గాయం బాధని అలాగే ఓర్చుకుంటూ ఆఫీసర్ ఇంటికెళ్ళాడు కోటయ్య. తీరా ఇంటికెళ్ళిం తరవాత, "బజారుకెళ్ళిరావాలిరా కోటాయ్", అంది అమ్మగారు.

"అయ్యగారు అర్జంటుగా రమ్మన్నారండి," తప్పించుకోటానికి ప్రయత్నించాడు కోటయ్య.

"ఫరవాలేదులే. నేను పంపించానంటే ఏమనరులే." మళ్ళీ బజారుకెళ్ళి రావాలనేసరికి కోటయ్యకి గుండెల్లో రాయిపడ్డది. ఎదురుదెబ్బ తగిలి కాలు నెప్పిపుడుతోందని చెబుదామనుకున్నాడు. "ఎలా అంటావో చూస్తానుగా", అని సవాలుచేసింది డవాలు.

"మధ్యాహ్నం ఉప్మాలోకి నిమ్మకాయలు కావాలి, ఓ అణాకి తీసుకురా", అమ్మగారు ఆర్డరు వేసింది. అయిష్టంగా కాళ్ళీడ్చుకుంటూ బజారు చేరుకున్నాడు కోటయ్య. నిమ్మకాయలుకొని తిరిగి వెడుతూంటే వీరయ్య కనిపించాడు. వీరయ్యకీ, కోటయ్యకీ చిన్నప్పటినించీ స్నేహం. పొలాలకి గొడ్లని తోలుకుంటూ ఇద్దరూ కలిసి వెళ్ళేవాళ్ళు.

"ఈ డవాలేంటిరో?" అన్నాడు ఆశ్చర్యంగా వీరయ్య. కోటయ్యకి చిన్నతనం వేసింది.

"నౌకరీకి కుదిరాలే", అన్నాడు తలదించుకొని.

"మా గొప్పనౌకరీలే. గొడ్డుకి వాతేసినట్టు ఈ డవాలేంటి? ఇంతకంటే మంచి ఉద్యోగమేం దొరకలే ? "

"ఏదో ఓటి", కోటయ్య అవమానంతో, పైకి ఏదో అనేసి చరచర నడిచిపోయాడు. వీరయ్యకేం, కాస్త పొలం పుట్రా ఉన్నవాడు. వాడు ఏపనిచేసినా చెల్లుతుంది. తను వాడితో వంతుపెట్టుకుంటే ఏంలాభం ?

దెబ్బతిన్న అభిమానంతో కోటయ్య ఎలాగో ఆఫీసర్ గారి ఇల్లు చేరుకుని నిమ్మకాయలు ఇంట్లో ఇచ్చి వెళ్ళబోయే సరికి అమ్మగారంది :

"ఒరే కోటాయ్, కాస్త పిల్లాణ్ణి ఎత్తుకుని ఆడించు, ఇంట్లో కాస్త పనుంది."

కోటయ్యకి ఒళ్లు మండింది.

"అయ్యగారు ఆలస్యమైతే కోపం చేస్తారమ్మా", అన్నాడు.

"ఊరికే కూచుంటేగా కోపం, ఇదికూడా పనేలే", అని అమ్మగారు పిల్లాణ్ణి కోటయ్యదగ్గర వొదిలి లోపలి కెళ్ళింది.

"ఛీ ఈ అబ్బాయి నెట్టనబ్బా ఎత్తుకోటం, ఒళ్ళంతా కురుపులే", చీదరించుకున్నాడు కోటయ్య. అసలే అతనికి చంటి పిల్లలంటే అసహ్యం. అందులో పరాయివాళ్ళ పిల్లలయి-ఆఫీసర్ గారి అబ్బాయిలాంటి వాడయితే ఇహ చెప్పటమెందుకు!

తనని ఎత్తుకోకపోవటం చూసి ఆకుర్రాడు ఒక్క-పెట్టున కొట్టినట్టుగా ఏడ్చాడు. లోపలినించి అమ్మగారు పరిగెత్తుకుంటూవొచ్చి కోటయ్యని చీవాట్లు పెట్టింది. కోటయ్య ఆడవాళ్ళచేత (తల్లిని మినహాయించి) ఎప్పుడూ చీవాట్లు తిన లేదు. ఇదే ప్రథమం. "ఛీ" అనుకున్నా డతడు.

కుర్రాడిని బుజ్జగించి, కాసేపటిలో అతన్ని వొదిలించుకుని బయట పడ్డాడు కోటయ్య. ఆఫీసులో అడుగు పెట్టగానే ఆఫీసర్ మండిపడ్డాడు.

"ఇంటిదగ్గర పనులు చెప్పారండి" అన్నాడు కోటయ్య.

"చెబితేమాత్రం, నేనంటే అంత నిర్లక్ష్యమా. నేను మాత్రం పనిమీదకాదా నిన్ను పంపింది?" అన్నాడు ఆఫీసర్.

"అమ్మగారు పనిచెబితే మీరేమీ అనరన్నారండి అమ్మగారు" అన్నాడు అమాయకంగా కోటయ్య.

"నోరుముయ్యి" అరిచాడు ఆఫీసర్. "బయటకూచుని గంట కొట్టినప్పుడు వెంటనే రా."

కోటయ్య బయట కూర్చున్నాడు. ప్రతి అయిదు నిమిషాలకీ, పదినిమిషాలకీ గంట కొట్టి ఏవో పనులు పురమాయించాడు ఆఫీసర్. గంట విన్నప్పుడల్లా కోటయ్యకి ఆత్మాభిమానం దెబ్బతినేది. "పేరుపెట్టి పిలవలేడూ, ఈ గంట కొట్టటమేమిటి? ఇంతకంటే కోటాయ్ అన్న పేరే నయం" అనుకున్నాడు కోటయ్య. ఆ గంట కొట్టటంలో ఆఫీసర్ పొందే ఆత్మతృప్తి, ఆనందం, స్వాతిశయం కోటయ్య కేం తెలుసు!

మధ్యాహ్నమయింది. కోటయ్య భోజనానికి ఇంటి కొచ్చాడు. ఇంటికి రాగానే ఏమిటో, అంతా కొత్తగా ఉందతనికి. తను మునుపటి కోటయ్యకాదు. జమాను కోటయ్య! ఇంట్లోని ప్రతివస్తువూ అతన్ని గేలిచేస్తున్నట్టుంది; ప్రతిదీ చులకనగా తనవైపు చూస్తున్నట్టుంది.

"వేణ్ణీళ్ళు ఉన్నయ్యా?" స్నానంచేసి బడలిక తీర్చుకుందామని అడిగాడు కోటయ్య.

లేవని బుర్ర తిప్పింది రత్తమ్మ.

"ఏం?" అన్నాడు కోటయ్య కొంచెం కోపంతో.

"పుల్లల్లేవు" అంది రత్తమ్మ మామూలు ధోరణిలో.

"ఏరుకురాలే?"

"యాడేరుకొచ్చేది?"

"రోజూ యాడేరుకొస్తుండవు?"

రత్తమ్మ మాట్లాడలేదు. కోటయ్యకి కోపంవచ్చింది. రత్తమ్మకి తనంటే బొత్తిగా నిర్లక్ష్యం. గబగబ నోటికి వచ్చి నట్లు నాలుగు చీవాట్లు పెడదామనుకున్నాడు గాని, మళ్ళీ తమాయించుకున్నాడు. ఇంతకీ రత్తమ్మ ఏమన్నదని? అమ్మ గారు, ఆఫీసరుగారు తనని పెట్టిన చీవాట్లు తలపుకొచ్చాయి అతనికి. వాళ్ళంతంతలేసి మాటలంటూంటే ఏమీ అనలేని తను రత్తమ్మ మీద మాత్రం ఎందుకు కలుగజేసుకోవాలి? అయినా తను ఒక సామాన్య బంట్రోతు. కోపం, గీపం తన దగ్గరికి రావటానికి వీల్లేదు. ఒకళ్ళు తనని ఏమైనా అనాలిసిందే గాని, తను ఎవరినీ ఏమీ అనకూడదు. రత్తమ్మ మాత్రం తను చేసే మహాఘనమైన ఉద్యోగానికి ఏమంత గౌరవం చూపి స్తుంది. అయితే, తను ఈ ఉద్యోగం చెయ్యటం వాళ్ళ కోసమేగా. వాళ్ళకోసం తను అవమానం సహిస్తున్నాడు. సహించాలి. కేవలం అందుకోసమైనా తనవాళ్ళు తనమీద గౌరవాదరాలు చూపించొద్దూ?

"ఏందా ఆలోశన?" అంది రత్తమ్మ, కోటయ్య వైఖరి చూసి.

"ఏం లేదు."

"నే నెంత చెప్పినా ఇనక ఆ నౌకరిలో చేరితివి. ఆళ్ళేమైనా అన్నారేంటి?"

"ఏహె, లేదులే" అన్నాడు కోటయ్య కోపంగా.

"బువ్వ తాగుదుగాని పద, మళ్ళా నౌకరి కెళ్ళాలి గామాల" అంది రత్తమ్మ కొంచెం ఈసడింపుగా.

"నేను జమాను నౌకరి చేస్తే నీకేం కష్టం?" అన్నాడు కోటయ్య చిరాగ్గా.

"కష్టంలేదు. నష్టంలేదులే పా" అంది రత్తమ్మ.

"మరి బువ్వెట్టా వొచ్చుద్ది?" అన్నాడు కోటయ్య, రత్తమ్మ గొంతులోని వ్యంగ్యం పెడుతున్న బాధని అణుచుకుంటూ. రత్తమ్మ మాట్లాడలేదు. తను బంట్రోతుగా పని చెయ్యటం రత్తమ్మకీ, ఇంట్లో అందరికీ కూడా అవమానకరంగా ఉందని కోటయ్య గ్రహించాడు. కాని, తనేం చెయ్యగలడు? పోషించాల్సిన బాధ్యత తనది.

భోంచేసి ఆఫీసరుగారి ఇంటికి వెళ్ళాడు. ఇంటినించి ఆయనకి కాఫీ, టిఫిన్ తీసుకెళ్ళాలి. అక్కడ కాసేపు పిల్లవాణ్ణి ఎత్తుకునే డ్యూటీ తగిలింది. వెళ్ళబోతుండగా అమ్మగారు పిలిచి, "ఈ పూట పనిమనిషి రాలేదు, పైకిపోయి గది చిమ్మిరా" అంది. సొంత ఇల్లు కూడా ఎప్పుడూ చిమ్మలేదు. కోటయ్య "చిమ్మను" అనబోయి డవాలాచూసి "చిత్తం" అని పైకివెళ్ళాడు.

ఆ ప[illegible] పూర్తిచేసి వొచ్చేసరికి అమ్మగారు మళ్లీ ఇంకో పని పురమాయించింది.

"రాత్రి మొదటి ఆటకి సినిమాకి వెళ్లాలిగాని, పైన పక్క వేసిరా! మళ్లీ సాయంత్రం ఏవేళప్పుడు వొస్తావో, అయ్యగారు ఏం పనులు పురమాయిస్తారో."

కోటయ్యకి అరికాలిమంట నెత్తి కెక్కింది. రాత్రల్లా పడుకునేవాళ్లు, పడుకునే పక్క వేసుకోలేరా? దానికి వేరే మనిషి కావాలా? చేసేవాడు తేరగా ఉన్నాడని.

మనసులో కాసేపు బాధపడి, ఎదురు చెప్పటానికి ధైర్యంలేక ఆ పని కూడా పూర్తిచేసుకుని ఆఫీసుకి వెళ్లాడు కోటయ్య.

"ఏరా! నువ్వేం పనిచెయ్య దలుచుకోలేదా? ఇప్పుడా కాఫీ తీసుకురావటం?" గదిమాడు ఆఫీసర్.

"అమ్మగారు..."

"నోరుముయ్యి."

"ఎందుకయ్యా నోరు ముయ్యటం?" అనేమాటలు అతని నోటి చివరిదాకా వొచ్చాయి, కాని డవాలు "తగ్గరా, కోటాయ్" అంటంచేత మాట్లాడకుండా ఊరుకున్నాడు. ఎందుకు మాట మాటకీ అభిమానపడటం, సాగనప్పుడు. ఈ ఉద్యోగంలో ఆత్మాభిమానం ఉంటే కుదరదు. తను ఈ వాతావరణానికి అలవాటుపడక తప్పదు. అయినా ఈ ఆఫీసర్లకి ఇంత అహం ఎందుకో? అసలు ఒక మనిషికి ఇంకో మనిషిమీద ఏం అధికారముంది? కేవలం తను డబ్బు లేకపోవటంవల్ల అన్నిమాటలు పడాలిసొచ్చింది గాని, తనకే తిండి జరిగే సదుపాయం ఉంటే ఆ ఆఫీసర్ని గడ్డిపోచగా చూసి ఉండేవాడు. ఏ మనిషిపని ఆ మనిషి చేసుకోలేడూ? తన ప్రతి పనీ మరోమనిషిచేత చేయించుకునే అవసరం ఎందుకు కలగాలి? ప్రతివాడూ, ముఖ్యంగా ప్రతిఆఫీసరూ కొంతకాలం తప్పనిసరిగా బంట్రోతు ఉద్యోగం చెయ్యాలనే రూలు పెడితే! బంట్రోతులమీద అధికారం చెలాయించే ప్రతి ఆఫీసరూ, తనుకూడా ఒక బంట్రోతు మాత్రమే అని గ్రహిస్తే!

గంట గణగణ మోగింది. అదిరిపడి లేచాడు కోటయ్య. భయపడుతూ లోపలికి వెళ్ళాడు. ఆఫీసర్ అతనివైపు కా్రదంగా చూసి "గాడిదలు కాస్తున్నావా? ఫైల్సు తీసుకు పద." అన్నాడు. కోటయ్య మాట్లాడకుండా ఫైల్సు తీసుకున్నాడు. ఆఫీసర్ సైకిలెక్కి పోతున్నాడు. అప్రయత్నంగా కోటయ్య సైకిల్ వెనకాలే పరిగెత్తాడు. "హుం జట్కా వెంబడి లగెత్తే పిల్లోడిలాగా..." అనుకున్నాడు కోటయ్య. అతని మనసులో ఏవేవో ఆలోచనలు వొస్తున్నాయి. ఠపీమని ఎదురుదెబ్బ తగిలింది కాలి వేలుకి. కోటయ్య వొంగి వేలు పట్టుకున్నాడు, తగిలిన వేలుకే మళ్ళీ తగిలింది. నెత్తురు కారుతోంది. నరాలు జివ్వున లాగుతున్నాయి.

"కోటాయ్."

తలెత్తి చూశాడు. ఆఫీసర్ సైకిల్ దూరమయింది. ఆఫీసర్ వెనక్కి తిరిగి మండిపడుతు కేకేశాడు. యాంత్రికంగా వేలువిడిచి పరిగెత్తాడు కోటయ్య-కాదు కోటాయ్, డవాలా జవాను.